క్లుప్తంగా

పెద్దలోడిలో రేపు బీరప్ప స్వామి జాతర

మునిపల్లి(అందోల్): ఈ నెల 26వ తేదీన మండల పరిధిలోని పెద్దలోడి గ్రామంలో బీరప్ప, కామరతి కల్యాణం జరిపిస్తున్నట్టు గ్రామ సర్పంచ్ పార్వతీఅశోక్, ఎంపీటీసీ సభ్యురాలు రేణుకా వెంకటేశం శుక్రవారం తెలిపారు. 25న బీరప్ప స్వామికి బోనాలు, 26న బీరప్ప కామరతి కల్యాణం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ఆయా గ్రామాల భక్తులు హాజరుకావాలన్నారు. అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, ఎంపీపీ శైలజాశివశంకర్, జెడ్పీటీసీ సభ్యురాలు మీనాక్షి సాయికుమార్ వస్తున్నారన్నారు.

నిరుద్యోగులకు రూ.లక్ష నష్టపరిహారం ప్రకటించాలి

పటాన్‌చెరు టౌన్: పేపర్ లీకేజీ నిందితులపై కఠిన చర్యలు తీసుకొని, రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు రూ.లక్ష నష్టపరిహారం చెల్లించాలని పటాన్‌చెరు బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పేపర్ లీకేజీ ఘటన పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కోకన్వీనర్ శ్రీనివాస్ గుప్తా, జిల్లా కార్యవర్గ సభ్యులు మురళీధర్ వర్మ, డివిజన్ సలహాదారు కొండయ్య, ఉపాధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి, బాలరాజ్, శివయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో బోరు వేయించిన నీలం మధు



జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలోని ఎస్సీ బస్తీలో నీటిసమస్యను పరిష్కరించేందుకు చిట్కుల్ సర్పంచ్ నీలంమధు తన సొంత నిధులతో శుక్రవారం బోరు వేయించారు. స్థానిక ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు చెప్పినా బోరు వేయించలేదని, తమ సమస్యను గుర్తించి ముందుకొచ్చిన నీలంమధుకు బస్తీవాసులు కృతజ్ఞతలు చెప్పారు.

బీఆర్‌ఎస్‌ది అసమర్థ పాలన

కొండాపూర్(సంగారెడ్డి): రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అసమర్థ పాలన కొనసాగుతుందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు రవిశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీతో విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్ అయోమయ స్థితిలోకి వెళ్లిందని మండిపడ్డారు. పేపర్ లీకేజీ విషయంలో వెంటనే నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పరీక్షలు రాసిన విద్యార్థులకు లక్ష రూపాయల నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


ధర్నాకు తరలిన విద్యుత్ ఉద్యోగులు



ధర్నాకు వెళ్తున్న ఉద్యోగులు

ఝరాసంగం(జహీరాబాద్): తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో నిర్వహించిన విద్యుత్ ఉద్యోగుల ధర్నాకు ఝరాసంగం నుంచి అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, నర్సింలు, శేఖర్, రమేశ్, సంతోష్‌కుమార్, రాజప్ప, నర్సింలు, ప్రభాకర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం, పరిశుభ్రతపై అవగాహన



అవగాహన శిబిరంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని వడ్డి గ్రామంలో శుక్రవారం పౌష్టికాహారం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలు, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రఘునాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖబరస్తాన్ భూమిని కాపాడండి

హత్నూర(సంగారెడ్డి): మండల కేంద్రంలోని 1137 సర్వేనంబరులో ఉన్న ఖబరస్తాన్ భూమిని కాపాడాలని ముస్లింలు శుక్రవారం తహసీల్దార్ పద్మావతికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ భూమిని కొందరు కబ్జా చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. తహసీల్దార్ కలిసిన వారిలో కమిటీ సభ్యులు అబ్దుల్ హాది, షారుల్లా, అలిముద్దీన్, ఎజాస్, రఫీయుద్దీన్, ఇర్ఫాన్, ఆసిఫ్ మతపెద్దలు ఖాజీఅహ్మద్, శను, ఇస్మాయిల్, అబ్దుల్‌ఖదీర్, ఇలియాస్, మెహరాజ్, సాబీర్, అల్తాఫ్, నసిర్ ఉన్నారు.

గ్రామపంచాయతీల అభివృద్ధిలో పోటీ పడండి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



పండిట్ దీన్ దయాల్ సతత్ పంచాయతీ పురస్కారాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకుంటున్న విప్లవాత్మక నిర్ణయాల మూలంగా ప్రతి గ్రామం అభివృద్ధికి ప్రతీకలుగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన పండిట్ దీన్ దయాల్ సతత్ పంచాయతీ పురస్కారాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం 9 అంశాల్లో గ్రామ పంచాయతీలకు అందిస్తున్న ఉత్తమ అవార్డులో రాష్ట్రంలోని అత్యధిక గ్రామపంచాయతీలకు ఈ అవార్డులు రావడం సంతోషకరమన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టిన పల్లె ప్రగతి గ్రామాల రూపురేఖలు మారుస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ప్రతి పైసాను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను వంద సద్వినియోగం చేసుకుని పటాన్‌చెరు నియోజకవర్గ రాష్ట్రంలోని ప్రథమ స్థానంలో నిలిచిందని సంతోషం వ్యక్తం చేశారు. దేశంలో రాష్ట్రపతికి లేని అధికారం గ్రామపంచాయతీ సర్పంచ్‌కు ఉందని, ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకొని గ్రామాన్ని ప్రగతిపథంలో నిలపాలని కోరారు. నియోజకవర్గంలోని 55 గ్రామపంచాయతీలలో 40 గ్రామ పంచాయతీలకు సొంత నిధులతో ట్రాక్టర్లు పంపిణీ చేశానని గుర్తు చేశారు. పలుచోట్ల జీవీఆర్ ఎంటర్ ప్రైజెస్ సౌజన్యంతో గ్రామపంచాయతీ భవనాలు కూడా నిర్మించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ సీఈఓ ఎల్లయ్య, డీపీఓ సురేష్ మోహన్, ఎంపీపీలు సుష్మా శ్రీ ,దేవానంద్, ప్రవీణ విజయభాస్కర్ రెడ్డి, జెడ్పీటీసీలు సుప్రజ, సుధాకర్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్ గౌడ్, డీఎల్‌పీఓ సతీష్ రెడ్డి, ఎంపీడీఓలు బన్సీలాల్, మల్లీశ్వర్, రాములు, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రాయికోడ్‌లో...

రాయికోడ్(అందోల్): దీన్ దయాల్ ఉపాధ్యాయ పంచాయతీ సతత్ వికాస్ పురస్కార్ అవార్డులను ఎంపికైన గ్రామపంచాయతీలకు ప్రదానం చేశారు. రాయికోడ్‌లోని ఐకేపీ భవనంలో ఎంపీపీ మమత అధ్యక్షతన శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వెంకటేశం మాట్లాడుతూ 2021–22 సంవత్సరానికి సంబంధించి గ్రామాలభివృద్ధిని సూచించే 9 అంశాల్లో ఉత్తమ గ్రామాలుగా తీర్చిదిద్దిన మండలంలోని 15 గ్రామ పంచాయతీలను అవార్డులకు ఎంపిక చేశారన్నారు. ఆయా గ్రామాల అభివృద్ధిలో ఈజీఎస్ సిబ్బంది పాత్ర మరువలేదన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జ్ఞాన్‌భాయికాశీనాథ్ పాటిల్, శ్రీనివాస్‌రెడ్డి, నరేష్, పంచాయతీ, ఈజీఎస్ సిబ్బంది, నాయకులు పండరి, ఉప సర్పంచ్ రాజ్‌కుమార్ ఉన్నారు.



సన్మానం స్వీకరించిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు

మునిపల్లిలో...

మునిపల్లి(అందోల్): గ్రామాల అభివృద్ధికి కృషి చేసిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపీపీ శైలజాశివశంకర్, జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్ శాలువ కప్పి సన్మానించి అవార్డులను ప్రదానం చేశారు. శుక్రవారం ఎంపీపీ సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం జరిగింది. మండలంలోని 30 గ్రామ పంచాయతీలకుగాను 26 గ్రామ పంచాయతీలకు అవార్డులు వచ్చాయి.



తాటిపల్లి సర్పంచ్ అంజిరెడ్డికి అవార్డు ప్రదానం చేసిన ప్రజాప్రతినిధులు

సంగారెడ్డి మండలంలో...



పురస్కారాలు పొందిన ప్రజాప్రతినిధులు, అధికారులు

సంగారెడ్డి టౌన్: మండల పరిధిలోని 9 గ్రామ పంచాయతీలకు సతత్ వికాస్ పురస్కారాలు వచ్చాయని ఎంపీడీఓ రవీందర్ అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులకు ఎంపీపీ లావణ్య అధ్యక్షతన సన్మానం జరిగింది.

అభివృద్ధిలో ఆదర్శం



అవార్డులు అందుకున్న సర్పంచులు

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): సీఎం కేసీఆర్ హయాంలో చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎంపీపీ తొంట యాదమ్మకిష్టయ్య అన్నారు. ×దీన్ దయాల్ ఉపాధ్యాయ పంచాయతీ సతత్ వికాస్₹ పురస్కారాలను తొమ్మిది పంచాయతీల సర్పంచ్‌లకు ఎంపీడీఓ పూజ, జెడ్పీటీసీ గడీల శ్రీదేవిరాంరెడ్డి చేతుల మీదుగా శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో అందజేశారు.

పురస్కారాలు అందుకున్న సర్పంచ్‌లు

న్యాల్‌కల్(జహీరాబాద్):మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు శుక్రవారం అవార్డు అందుకున్నారు. మండల పరిధిలోని న్యాల్‌కల్, హుస్సెల్లి, ముంగి, టేకూర్, మల్గి, మిర్జాపూర్(ఎన్), రుక్మాపూర్, ఖలీల్‌పూర్, హుమ్నాపూర్ గ్రామ పంచాయతీలు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన తొమ్మిది విభాగాల్లో అవార్డులకు ఎంపిక అయ్యాయి. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు శుక్రవారం అవార్డులు అందజేశారు.



ఎమ్మెల్యే మాణిక్‌రావు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మల్గి సర్పంచ్ మారుతియాదవ్

ప్రభుత్వ పాఠశాలల బలోపేతం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయిస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. నియోజకవర్గపరిధిలో శిథిలావస్థకు చేరుకున్న పురాతన పాఠశాల భవనాలను తొలగించి నూతన భవనాల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని అంబేద్కర్ కాలనీలో జేకే. పెన్నార్ సంస్థ సహకారంతో 25 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అదనపు తరగతి గదులను శుక్రవారం సాయంత్రం ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఊరు–మన బడి పథకం ద్వారా ప్రతి ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. పాఠశాల అభివృద్ధికి జేకే.పెన్నార్ సంస్థ నిధులు కేటాయించడం పట్ల ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, మండల విద్యాధికారి రాథోడ్, శర్వాణ మార్థాండన్, డాక్టర్ సర్వేశ్, మోహన సుందరం, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఉపవాస దీక్షలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభించారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని నెల రోజుల పాటు ఈ ఉపవాస దీక్షలను చేస్తారని ముస్లిం పెద్దలు తెలిపారు.

చిరుధాన్యాలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రామకృష్ణ

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): చిరుధాన్యాల పోషణ, ఔషధ ప్రాముఖ్యంపై మండల పరిధిలోని నిజాంపూర్(కే) ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఉపాధ్యాయుడు డాక్టర్ రామకృష్ణ అవగాహన కల్పించారు. అనంతరం చిరుధాన్యాలపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మురార్జీ, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ స్వప్న, అంగన్‌వాడీ టీచర్ సువర్ణ, ఆశ వర్కర్ మానస తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని హద్నూర్ నవభారత్ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు తామే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. డీఈఓగా కౌశతంత్, ఎంఈఓగా మహేశ్, హెచ్‌ఎంగా తావుర మహేశ్, ఉపాధ్యాయులుగా అఖిల్, వినోద్, సతీశ్, రితీష్, వ్యవహరించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు హెచ్‌ఎం రవి బహుమతులు ప్రదానం చేశారు.



ఉపాధ్యాయులుగా విద్యార్థులు

కేతకిలో బ్యాంకు అధికారుల పూజలు

ఝరాసంగం(జహీరాబాద్): కేతకి సంగమేశ్వర ఆలయంలో కెనరా బ్యాంకు సీజీఎమ్ పట్నాయక్ ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయాధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గర్భగుడిలోని పార్వతీపరమేశ్వరులకు అభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి తదితర ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ నీల వెంకటేశం సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ జూనియర్ అసిస్టెంట్ శివకుమార్, ఆర్‌ఏహెచ్ సతీష్‌కుమార్, ఎల్‌డీఎం గోపాల్‌రెడ్డి, వివిధ బ్రాంచ్ మేనేజర్లు రాఘవేందర్‌రెడ్డి, రవికుమార్, హరీష్‌దార్ల పాల్గొన్నారు.

మానవ సంపదతోనే అభివృద్ధి సాధ్యం

రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ కమిషనర్ అండ్ సెక్రెటరీ భారతి హోలికేరి



గోడ పత్రిక విడుదల చేస్తున్న కలెక్టర్ శరత్, ఇతర అధికారులు

సంగారెడ్డి టౌన్: మానవ సంపదతోనే అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనర్ భారతి హోలికేరి అన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, అజీమ్ ప్రేమ్ జీ పౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో అంగన్‌వాడీ టీచర్ల పూర్వ ప్రాథమిక విద్యా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా భారతి హోలికెరి మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్యా సదస్సులో అంగన్‌వాడీ టీచర్లను భాగస్వాములను చేయడం గొప్ప విషయమన్నారు. బోధన సామర్థ్యాన్ని మించిన గొప్ప వృత్తి మరొకటి లేదన్నారు. అంగన్ వాడీ టీచర్లు పిల్లలకు పూర్వ ప్రాథమిక స్థాయిలో విద్యా బోధన చేస్తారు కాబట్టి ఈ స్థాయిలో మంచి పునాది ఏర్పడుతుందన్నారు. అజీమ్ ప్రేమ్ జీ పౌండేషన్, విప్రో ప్రతినిధులను ఆమె అభినందించారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ శరత్ మాట్లాడుతూ ఒక గ్రామం ఆదర్శవంతంగా ఉందంటే అక్కడ అంగన్‌వాడీ కేంద్రం బాగా పనిచేస్తుందన్నారు. అంగన్‌వాడీలోనే ప్రతి పౌరుడి పునాది పడుతుందన్నారు. అనంతరం పోషణ పక్షం పోస్టర్లను వారు ఆవిష్కరించారు. విప్రో పౌండేషన్ ప్రతినిధులు అందించిన ప్లే స్కూల్ మెటీరియల్స్‌ను అంగన్‌వాడీ టీచర్లకు అందజేశారు. అదనపు కలెక్టర్ వీరారెడ్డి, మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి పద్మావతి, అజీమ్ ప్రేమ్ జీ రాష్ట్ర ప్రతినిధి ఎం శ్రీనివాస్, జిల్లా ప్రతినిధి యోగేశ్, విప్రో పౌండేషన్ ప్రతినిధులు రామకృష్ణ, మీనా, సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, పాల్గొన్నారు.

సర్పంచ్‌లుగా మళ్లీ ఎన్నికయ్యేలా పనిచేయండి

అందోల్ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్



ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న చందులతమల్లప్ప

జోగిపేట(అందోల్): ప్రజలకు అందుబాటులో ఉండి, కొత్త తరహాలో పాలనను అందిస్తే ప్రజలు మళ్లీ మిమ్మల్నే మరోసారి సర్పంచ్‌లుగా గెలిపిస్తారని అందోలు ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. శుక్రవారం జోగిపేట ఎంపీపీ సమావేశ మందిరంలో దీన దయాల్ ఉపాధ్యాయ పంచాయతీ సతత్ వికాస్ పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ సర్పంచ్‌లనుద్దేశించి ప్రసంగించారు. అందుబాటులో ఉంటూ, ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా చూడాలన్నారు. గ్రామాభివృద్ధే లక్ష్యంగా నిజాయతీగా పనిచేయాలన్నారు. సర్పంచ్‌లకు బిల్లులు రావాల్సి ఉన్నా మాపై ఒత్తిడి తేకుండా పనిచేస్తుండడం అభినందనీయమన్నారు. మనం పదవిలో ఉన్నప్పుడు చేసిన సేవలే గుర్తుండి పోతాయన్నారు. మండల స్థాయిలో అవార్డులు పొందిన వారు జిల్లా, రాష్ట్ర స్థాయిలో పొందేందుకు పోటీ పడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జి.బాలయ్య, జెడ్పీటీసీ కే.రమేశ్, ఎంపీడీఓ సత్యనారాయణ, వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధితోనే పురస్కారాలు

ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు



అవార్డును అందజేస్తున్న ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు

జహీరాబాద్: గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసినందుకే పురస్కారాలు దక్కాయని ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు అన్నారు. శుక్రవారం జహీరాబాద్ పట్టణంలోని ఫ్రెండ్స్ ఫంక్షన్‌హాల్‌లో దీన్ దయాల్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా జహీరాబాద్, కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్, మొగుడంపల్లి మండలాల్లోని 54 గ్రామ పంచాయతీలకు ఎమ్మెల్యే అవార్డులను అందజేసి, అభినందించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాణిక్‌రావు మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తమవిగా భావించి వాటిని పరిష్కరించి సుందరంగా తీర్చిదిద్దడం సంతోషకరమన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ప్రజల ఆరోగ్యం బాగుంటుందన్నారు. గ్రామాల అభివృద్ధికి సర్పంచ్, ఎంపీటీసీ, పంచాయతీ కార్యదర్శుల కృషి ఎనలేనిదని అభినందించారు. కార్యక్రమంలో న్యాల్‌కల్ ఎంపీపీ అంజమ్మ, ఎంపీడీఓలు సుమతి, సుజాతనాయక్, వెంకట్‌రెడ్డి, మహేష్, సుజాత, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే అవార్డులు



నారాయణఖేడ్: అవార్డులు అందుకున్న వారితో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: అధికారులు, ప్రజాప్రతినిధుల సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. ఖేడ్ మండలం జూకల్ శివారులోని కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం ఖేడ్ డివిజన్‌లోని 105 పంచాయతీలకు 9 అంశాలకు సంబంధించి 167 అవార్డులను ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ చాందీబాయి చౌహాన్, జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్, నర్సింహ్మారెడ్డి, నాయకులు పరమేశ్వర్, రమేష్ చౌహాన్, చెన్‌బసప్ప తదితరులు ఉన్నారు.

కూలీల సంఖ్య పెంచుకోవాలి

ఝరాసంగం(జహీరాబాద్): ఉపాధి హామీ పనులను చేయడానికి కూలీల సంఖ్యను పెంచుకోవాలని ఎంపీడీఓ సుజాత ఆదేశించారు. శుక్రవారం ఝరాసంగం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సమావేశ మందిరంలో ఆమె పంచాయతి కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి పనులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఉపాధి హామీ ఏపీఓ రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుజాత

‘ఖేడ్’లో కాంగ్రెస్ ధర్నా

నారాయణఖేడ్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని కుట్రపూరితంగా రద్దు చేయడం అప్రజాస్వామికమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు డా.సంజీవరెడ్డి అన్నారు. కేంద్రప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో భారీ నిరసన ర్యాలీ, అనంతరం గాంధీ చౌక్‌లో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఇది చీకటి రోజుఅని అభివర్ణించారు. దేశ ఐక్యత, ప్రజాస్వామ్య పరిరక్షణకు రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర చేపట్టడం, ఆదానీ, మోదీ చీకటి స్నేహంపై నిలదీయడంతో ప్రధానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయన్నారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, న్యాయవాది సంగన్న, భోజిరెడ్డి, వినోద్‌పాటిల్, జ్ఞానేశ్వర్, సుధాకర్‌రెడ్డి, సర్దార్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంబేద్కర్ చౌక్‌లో జిల్లా ప్రణాళికా సంఘం మాజీ సభ్యుడు నగేష్ షెట్కార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ధర్నా నిర్వహించారు. నాయకులు రషీద్, తాహెర్, మాణిక్‌రావు, వివేకానంద్, నెహ్రూనాయక్, సద్దాం, శివకుమార్, చందర్‌నాయక్, బక్షిరాం, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



నారాయణఖేడ్: గాంధీ చౌక్‌లో ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు

బోరంచ ఆలయ హుండీలెక్కింపు

మనూరు(నారాయణఖేడ్): బోరంచ నల్లపోచమ్మ ఆలయ హుండీని ఎండోమెంట్ అధికారులు లెక్కించారు. జిల్లా ఎండోమెంట్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్, ఈఓ మోహన్ రెడ్డి ఎంపీపీ జయశ్రీమోహన్‌రెడ్డి, సర్పంచ్ రేణుక పండరిలు హాజరయ్యారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు లెక్కింపు కొనసాగింది. ఆలయానికి రూ.6,72,102 లక్షల ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు.

‘హాథ్‌సేహాథ్ జోడో’ యాత్రను జయప్రదం చేయాలి

నారాయణఖేడ్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్‌సేహాథ్ జోడో యాత్ర ఖేడ్‌కు వస్తున్న నేపథ్యంలో జయప్రదం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు డా.సంజీవరెడ్డి కోరారు. ఖేడ్‌లోని తన నివాసంలో శుక్రవారం నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీ చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించేందుకు రేవంత్‌రెడ్డి ఈ యాత్ర నిర్వహిస్తున్నారన్నారు. డీసీసీ కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు సుధాకర్‌రెడ్డి, సత్యనారాయణ, భోజిరెడ్డి, సంగన్న, వినోద్‌పాటిల్, దామ నాగన్న, సంగమేశ్వర్, యాదవరెడ్డి పాల్గొన్నారు.

మత్స్య పారిశ్రామిక సహకార సంఘ కార్యవర్గం

నారాయణఖేడ్: ఖేడ్ మండలం కాంజీపూర్ ముదిరాజ్ భవనంలో గ్రామ ప్రాథమిక మత్స్యకార సహకార సంఘ ఎన్నికలు మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్నికల అధికారిగా మత్స్యశాఖ జిల్లా జూనియర్ ఇన్‌స్పెక్టర్ ఆర్.నవీన్‌కుమార్ వ్యవహరించగా ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షుడిగా సాయిలు, ఉపాధ్యక్షుడిగా శేఖర్, కార్యదర్శిగా సాయిలు, డైరెక్టర్లుగా సంగయ్య, బాగయ్య, పోచయ్య, తుకారాం, విటల్, కిష్టయ్య ఎన్నికయ్యారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

మనూరు(నారాయణఖేడ్): మండల పరిధిలోని మాయికోడ్‌లోని రేవప్ప ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎస్‌ఐ లక్ష్మణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో గ్రామస్తులు, వ్యాపారులు, యువజన సంఘాల నాయకులు సీసీ కెమెరాలను తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.